క్లుప్తంగా

డాక్టర్ ప్రవీణ్‌కు అభినందనల వెల్లువ



డాక్టర్ ప్రవీణ్‌ను అభినందిస్తున్న వెంకటేశ్వర్లు తదితరులు

రామచంద్రపురం: ఎయిడ్స్ నిర్మూలన, అవగాహనలో విశేష కృషి చేసినందుకు రాష్ట్ర స్థాయిలో ఉత్తమ అవార్డు పొందిన స్థానిక ఏరియా ఆసుపత్రి సూపరింటెండెట్ డాక్టర్ ఎస్.ప్రవీణ్ కుమార్‌కు పలువురు గురువారం అభినందనలు తెలియజేశారు. పారా మెడికల్ ఎంప్లాయిస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, జేఏసీ జిల్లా ఉపాధ్యక్షుడు మాధవరపు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రవీణ్ ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా విశేష కృషి చేశారని, జాతీయ, రాష్ట్ర స్థాయి అనేక అవార్డులు సాధించారని కొనియాడారు. అనేకమంది ప్రజలు ప్రాణాలు కాపాడడంతో పాటు రామచంద్రపురం ఏరియా ఆసుపత్రికి గుర్తింపు తీసుకొచ్చారన్నారు. కార్యక్రమంలో వీఆర్వో రాష్ట్ర కార్యదర్శి, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల గౌరవ అధ్యక్షుడు మద్దాల బాపూజీ, రిటైర్డ్ డీపీఎంఓ గొల్లపల్లి కృష్ణ, బక్కి రవీంద్ర, డి.కృష్ణారావు, వెల్ల నాగేశ్వరరావు, సూరిబాబు తదితరులు పాల్గొన్న వారిలో ఉన్నారు.

కపిలేశ్వరపురంలో ఇసుక ర్యాంపు ప్రారంభం



కపిలేశ్వరపురంలో ఇసుక ర్యాంపును ప్రారంభిస్తున్న నిర్వాహక ప్రతినిధులు

కపిలేశ్వరపురం: స్థానికంగా గౌతమి గోదావరిలో ఇసుక ర్యాంపు నుంచి ఇసుక తవ్వకాలను గురువారం ప్రారంభించారు. మిధిల కన్‌స్ట్రక్షన్‌కు చెందిన ప్రతినిధులు ర్యాంపును ప్రారంభించారు. ఉచిత ఇసుక విధానంలో ఇసుకను లబ్ధిదారులకు అందజేస్తామని తహసీల్దార్ చిన్నారావు తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాలు మేరకు జియో కార్డినెన్స్ పరిధిలో మాత్రమే తవ్వకాలను జరపాలని నిర్వాహకులను ఆదేశించామన్నారు. కార్యక్రమంలో వీఆర్వోలు రామకృష్ణ, వెంకటేశ్వరరావు, జట్టు కూలీలు పాల్గొన్నారు.

108 వాహనంలో ప్రసవం



108లో ప్రసవించిన మహిళ, పక్కనే వాహన సిబ్బంది

మండపేట: ప్రసవ ఘడియలు దగ్గర పడడంతో 108 వాహనంలో మండపేట ప్రభుత్వాసుపత్రిలో చేరడానికి వస్తున్న ఓ నిండు గర్భిణి మార్గంమధ్యలోనే పురిటినొప్పులు ఎక్కువై పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది. మండలంలోని ఏడిదకు చెందిన గర్భిణి సీహెచ్ మౌనిక(25)కు గురువారం సాయంత్ర పురిటినొప్పులు మొదలయ్యాయి. కుటుంబ సభ్యులు గమనించి 108కు ఫోన్ చేశారు. ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ రొంగలి రామకృష్ణ, పైలట్ ప్రసాద్ వెంటనే స్పందించి ఏడిద బాధితుల ఇంటికి చేరుకున్నారు. అక్కడ నుంచి గర్భిణిని వాహనంలో ఎక్కించి మండపేట ప్రభుత్వాసుపత్రికి తరలిస్తున్న క్రమంలో మార్గంమధ్యలో పురుటి నొప్పులు ఎక్కువయ్యాయి. సిబ్బంది ప్రసవం చేశారు. మౌనిక మగబిడ్డకు జన్మనివ్వగా.. తల్లీబిడ్డా క్షేమంగా ఉన్నారని, వారిని స్థానిక ప్రభుత్వాసుపత్రిలో చేర్చామని టెక్నీషియన్ రామకృష్ణ చెప్పారు. వీరితో ఏడిద ఆశ వర్కర్ ఉన్నారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొని కారు ధ్వంసం



కారు ఢీకొట్టడంతో విరిగిన విద్యుత్ స్తంభం, ధ్వంసమైన కారు ముందు భాగం

అయినవిల్లి: మండలంలోని ముక్తేశ్వరం జయంతి రామయ్య పంతులు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద గురువారం పెళ్లి బృందాన్ని దింపి వస్తున్న కారు 33 కేవీ విద్యుత్ స్తంభాన్ని ఢీకొంది. డ్రైవర్ కాకినాడలో కారుని అద్దెకు తీసుకుని అమలాపురంలో పెళ్లి బృందాన్ని దింపి ముక్తేశ్వరం మీదుగా అయినవిల్లిలంక తన స్వగృహానికి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో కారు బెలూన్ ఓపెన్ కావడంతో అందులో ఉన్న డ్రైవర్ స్వల్పగాయాలతో బయట పడ్డాడు. ఆ సమయంలో ఆ కారులో అతను ఒక్కడే ఉన్నాడు. చుట్టు పక్కల కూడా ఎవరూ లేరు. కారు బలంగా ఢీకొనడంతో విద్యుత్ స్తంభం పూర్తిగా విరిగింది. కారు ముందుభాగం నుజ్జునుజ్జు అయ్యింది.

పెరిగిన పెట్టుబడి.. తగ్గిన దిగుబడి

- కౌలుదారులకు తప్పని కష్టాలు
- రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాల్లో 80 శాతం పంట ఒబ్బిడి
- ఎకరానికి 30 నుంచి 35 బస్తాల దిగుబడి



రోడ్డుపై అమ్మకానికి ఉంచిన ధాన్యం బస్తాలు



సుందరపల్లిలో యంత్రాలతో ధాన్యాన్ని సేకరిస్తున్న రైతులు

కె.గంగవరం: తొలకరి సాగు రైతులకు మిశ్రమ ఫలితాలు ఇచ్చింది. ఈ సీజన్‌లో పంట దిగుబడులు ప్రాంతాన్ని బట్టి ఎకరానికి 25 నుంచి 30 బస్తాలు మాత్రమే వచ్చాయి. ఈ దిగుబడులు పెట్టుబడులకు సరిపోతున్నాయని రైతులు చెబుతుండగా, తమకు నష్టాలు వచ్చాయని కౌలుదారులు వాపోతున్నారు. వరి పైరు ఈనిక సమయంలో కురిసిన అధిక వర్షాలకు పూత రాలిపోయింది. కొంతమేర తెగుళ్లు కూడా సోకాయి. గింజ గట్టిపడే సమయంలో అధిక ఉష్ణోగ్రతల వలన ధాన్యపు గింజలు నొక్కుకుపోయాయి. ఇవి దిగుబడిపై ప్రభావం చూపాయని అన్నదాలు చెబుతున్నారు. మెరకు భూముల్లో ఎకరానికి 30 నుంచి 35, పల్లపు పొలాల్లో 25 నుంచి 35 బస్తాల దిగుబడి వచ్చినట్లు రైతులు చెబుతున్నారు. రైతు తమ ధాన్యాన్ని ఎక్కడైనా అమ్ముకోవచ్చని ప్రభుత్వం ప్రకటించింది. దానిని ఆసరాగా తీసుకుని దళారీలు కళ్లాల వద్దకు వెళ్లి తక్కువ ధరకు ధాన్యాన్ని కొనుగోలు చేశారు. అదే సమయంలో వాతావరణంలో మార్పులు రావడంతో రైతులు కంగారు పడి వచ్చిన రేటుకు ధాన్యాన్ని విక్రయించేశారు. ఈ క్రమంలో వారికి ఆశించిన రేటు కూడా దక్కలేదు.

క్లస్టర్ పరిధిలో ఇలా..

రామచంద్రపురం నియోజకవర్గంలోని కె.గంగవరం, రామచంద్రపురం రూరల్, కాజులూరు మండలాల్లో 54 వేల ఎకరాల్లో వరిసాగు చేయగా మండపేట నియోజకవర్గంలోని కపిలేశ్వరపురం, రాయవరం మండలాల్లో 58 వేల ఎకరాల్లో వరిసాగు చేశారు. రెండు నియోజకవర్గాల్లో ఇప్పటి వరకు 80 శాతం పట ఒబ్బిడి అయింది. కోతలు జరిగిన ప్రాంతాల్లో కొత్త విత్తనాలు, పీఎల్ సన్న రకాలు సాగు చేసిన రైతులకు ఎకరానికి 25 బస్తాల దిగుబడులు వస్తున్నాయి. స్వర్ణ రకం సాగు చేసిన వారికి 30 బస్తాల దిగుబడులు వస్తున్నాయి. తొలకరి సాగుతో తాము నష్టపోతున్నామని కౌలుదారులు పేర్కొంటున్నారు. ఎకరం విస్తీర్ణంలో పండిన ధాన్యంలో కౌలు రైతుకు చెల్లించగా మిగిలిన బస్తాలను అమ్మితే వచ్చే సొమ్ములతో పెట్టుబడులకు సరిపోతోందని చెబుతున్నారు. ఎకరానికి పెట్టుబడి రూ.22 వేలు అయితే దిగుబడులు 25 నుంచి 35 బస్తాలు వస్తున్నాయని వివరిస్తున్నారు.

రిస్క్ ఎందుకులే, క్యాష్ ఇస్తున్నారుగా..

తాము పండించిన ధాన్యాన్ని రైతులు ఎక్కడైనా అమ్ముకోవచ్చని ప్రభుత్వం ఆదేశాలు ఇవ్వడంతో ధాన్యం దళారీలకు గేట్లు ఎత్తివేసినట్టు అయింది. దళారీలు స్వయంగా పంట చేల వద్దకు వెళ్లి కోసిన ధాన్యం బస్తా ఒక్కింటికి ప్రభుత్వ మద్దతు ధర కన్నా తక్కువగా రూ.1650 చొప్పున వెంటనే క్యాష్ ఇస్తామని, అదే ఆరుదల ధాన్యానికి రూ.1725 చొప్పున చెల్లిస్తామని ప్రతిపాదిస్తున్నారు. రైతులు తమ తక్షణ ఆర్థిక అవసరాల కోసం ధాన్యాన్ని అదే రేటుకు అమ్ముకుంటున్నారు. వాతావరణం కూడా రోజుకో విధంగా ఉండడంతో రిస్క్ ఎందుకులే.. క్యాష్ ఇస్తున్నారుగా అని రైతులు దళారీలు చెప్పిన రేటుకే అమ్మేస్తున్నారు.

రబీ ఆదుకుంటేనే గట్టెక్కేది



ఖరీఫ్ పంట కష్టాలు తెచ్చి పెట్టింది. వాతావరణంలో మార్పులు, కొత్త రకం వండగాల సాగు, పల్లపు భూములు కావడం వల్ల ఎకరానికి 25 నుంచి 30 బస్తాల దిగుబడులు వస్తున్నాయి. కౌలు కింద 14 బస్తాలు చెల్లించాలి. మిగిలింది పెట్టుబడులకు కింద పోతోంది. రబీ పంటకు రక్షిస్తే గట్టెక్కగలుతాం.

– ఇళ్ల సూర్యనారాయణ, రైతు, శివల

గతేడాదితో పోలిస్తే తగ్గింది



గతేడాదితో పోలిస్తే ప్రస్తుత ఖరీఫ్‌లో ధాన్యం దిగుబడులు తగ్గాయి. రామచంద్రపురం నియోజకవర్గంలో దిగుబడులు సరాసరిన 25 నుంచి 35 బస్తాలు వస్తున్నాయి. వాతావరణంలో మార్పులు, కొత్త రకం విత్తనాల తదితరల కారణాలతో ఎకరానికి దిగుబడి తక్కువగా వస్తుంది. రబీ పంట ఆశాజనకంగా ఉంటుందని రైతులకు మేలు చేస్తుందని ఆశిస్తున్నాం.

– బలుసు రవి, ఏఓ, కె.గంగవరం

ధాన్యం కొనుగోలులో నిబంధనలు సడలించాలి



కాజులూరులో ధాన్యం కొనుగోలు తీరుపై ఆందోళన వ్యక్తం చేస్తున్న రాజబాబు

కాజులూరు: ధాన్యం కొనుగోలులో ప్రభుత్వం నిబంధనలు సడలించి తేమ శాతాన్ని తగ్గించి ధాన్యాన్ని మద్దతు ధరకు కొనుగోలు చేయాలని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వల్లు రాజబాబు అన్నారు. గురువారం మండలంలోని తర్లంపూడి, చేదువాడ, మంజేరు, శీల, పెనుమళ్ల, తనుమళ్ల, తదితర గ్రామాలలో రాజబాబు పర్యటించి వర్షాలకు నీట తడిసిన వరి పంటను, ధాన్యం రాశులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ కళ్లాల వద్ద 16, 17 శాతం చూపిస్తుండగా మిల్లర్లు 20, 22 శాతం ఉంటుందంటూ బస్తాకు రెండు వందలు వరకూ తగ్గించి కొనుగోలు చేస్తున్నారన్నారు. 20 శాతం వరకూ ఉన్నప్పటికీ మద్దతు ధరకు కొనుగోలు చేయాలని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఆదేశాలు జారీ చేసినప్పటికీ ఆ దిశగా కొనుగోలు జరగడం లేదన్నారు. ప్రభుత్వం స్పందించి తగిన చర్యలు తీసుకోవాన్నారు. కార్యక్రమంలో రైతులు నామ చంద్రరావు, తాతరావు, ముసలయ్య, వెంకటేశ్వరరావు, కొండ తదితరులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతమే లక్ష్యంగా పనిచేయాలి



మండపేటలో సత్యవేణిని అభినందిస్తున్న ఎమ్మెల్సీ తోట, పాపారాయుడు

కపిలేశ్వరపురం: క్షేత్ర స్థాయిలో వైఎస్సార్ సీపీ బలోపేతమే లక్ష్యంగా పనిచేయాలని నూతనంగా నియమితులైన పార్టీ రాష్ట్ర ఎంపీపీల కమిటీ ప్రధాన కార్యదర్శి మేడిశెట్టి సత్యవేణికి పార్టీ నియోజకవర్గ కో ఆర్డినేటర్, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు సూచించారు. ప్రధాన కార్యదర్శిగా నియమితులైన అనంతరం తొలిసారిగా సత్యవేణి ఎమ్మెల్సీ తోటను మండపేటలోని క్యాంపు కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. తన నియామకానికి కృషి చేసినందుకు ఎమ్మెల్సీ తోటకు సత్యవేణి కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్సీ తోట మాట్లాడుతూ ప్రజలు ఇచ్చిన ప్రజాప్రతినిధి పదవిని ప్రజల అభ్యున్నతి కోసం ఉపయోగించాలన్నారు. అయిదేళ్లపాటు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలనను చూసిన ప్రజలు 150 రోజులుగా ప్రజా వ్యతిరేక పాలనను చూస్తున్నారన్నారు. అమలు సాధ్యం కాని హామీలను గుప్పించిన కూటమి ప్రభుత్వం హామీల అమలు విషయంలో ఆర్థికపరమైన సాకులు చూపిస్తుందన్నారు. రోజులు గడిచే కొద్దీ కూటమి ప్రభుత్వంలోని డొల్లతనం తేటతెల్లం అవుతుందన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులుగా బాధ్యతాయుతమైన స్థానంలో నిత్యం ప్రజా క్షేత్రంలో ఉండాలని సూచించారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి కర్రి పాపారాయుడు మాట్లాడుతూ ఎంపీపీల రాష్ట్ర కమిటీలో కీలకమైన స్థానాన్ని మండపేట నియోజకవర్గానికి ఇవ్వడంపై సంతోషాన్ని వ్యక్తం చేశారు. భవిష్యత్ ప్రజాయుత వైఎస్సార్ సీపీదే అన్నారు. సత్యవేణిని అభినందించిన వారిలో జెడ్పీటీసీ పుట్టపూడి అబ్బు, ఎంపీపీ ఉండమట్ల శ్రీనివాసు, ఎంపీటీసీ పలివెల మధు, నాయకులు మేడిశెట్టి దుర్గారావు, పలివెల సుధాకర్, రామకృష్ణ ఉన్నారు.

నిత్యాన్నదానానికి రూ.16,116 విరాళం



దాత గోపాలకృష్ణ యాదవ్‌కు స్వామి చిత్రపటం అందజేస్తున్న అర్చకులు

అయినవిల్లి: స్థానిక విఘ్నేశ్వరస్వామి ఆలయంలో అమలుచేస్తున్న నిత్యాన్నదాన పథకానికి అయినవిల్లికి చెందిన వంత్రపాటి బాలగోపాలకృష్ణ యాదవ్ కుటుంబ సభ్యులతో కలసి గురువారం రూ.16,116 విరాళం అందజేశారు. దాత ఈ సొమ్మును ఆలయ అర్చకులు వినాయకరావుకు అందజేశారు. దాతను వేదమంత్రాలతో సత్కరించి స్వామి చిత్రపటం, ప్రసాదం అందజేశారు. దాతను ఆలయ సిబ్బంది, అర్చక సిబ్బంది, గ్రామస్తులు అభినందించారు.

అరటి తోటలను పరిశీలించిన విద్యార్థులు

కేదారిలంకలో ఉద్యాన సాగు పరిశోధన



కేదారిలంక అరటితోటను పరిశీలిస్తున్న ఉద్యాన విశ్వవిద్యాలయం విద్యార్థులు

కపిలేశ్వరపురం: అంబాజీపేట డాక్టర్ వైఎస్సార్ హార్టీ కల్చరల్ విశ్వవిద్యాలయం ఉద్యాన పరిశోధనా స్థానం పరిధిలో ఉన్న పశ్చిమ గోదావరి జిల్లా వెంకన్నరామన్నగూడెం ఉద్యాన కళాశాల విద్యార్థులు కపిలేశ్వరపురం మండలంలోని కేదారిలంక ఉద్యాన పంటలను పరిశీలించారు. గ్రామీణ ఉద్యాన కృషి అనుభవ కార్యక్రమంలో భాగంగా కళాశాలలోని నాలుగో సంవత్సరం చదువుతున్న విద్యార్థులు కేదారిలంకలోని అరటి తోట సాగు పద్ధతులను పరిశీలించారు. బంచ్ ఫీడింగ్, బంచ్ స్ప్రేయింగ్ అనే అధునాతన పద్ధతులను అంబాజీపేట పరిశోధనా కేంద్రం హెచ్‌ఆర్ఎస్ సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ చలపతి రావు, డాక్టర్ వైఎస్సార్ హార్టీ కల్చరల్ విశ్వవిద్యాలయం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం.విశ్వనాథ్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ బంచ్ ఫీడింగ్ పద్ధతిలో భాగంగా ఆవుపేడ, నీరు, యూరియా, ఎంఓపీ మిశ్రమాన్ని పాలిథిన్ కవర్‌లో వేసి వాలుగా కొసినన మొగపువ్వు మొక్కకు కట్టాలన్నారు. దానివల్ల అరటి చెట్టు అడుగున ఉన్న హస్తాలకు పోషణ అంది చెట్టుపైన వచ్చే హస్తాలు ధృడం గానూ, సమానంగానూ వచ్చి అధిక ఆదాయం లభిస్తుందన్నారు. బంచ్ స్ప్రేయింగ్ పద్ధతిలో భాగంగా పొటాషియం నైట్రేట్, నీరు మిశ్రమాన్ని అరటి గెలలపై పిచికారీ చేయడం ద్వారా గెలలోని కాయలు పొడవుగానూ, ధృడంగాను తయారవుతాయన్నారు.

నేల స్వభావానికి అనుగుణంగా ఎరువులు వాడాలి



రైతుల నుద్దేశించి మాట్లాడుతున్న మండల వ్యవసాయాధికారి ప్రభాకర్

రాయవరం: నేల స్వభావాన్ని అనుసరించే రైతులు ఎరువులు వాడాలని, లేకుంటే భూమి చౌడుబారిపోయే ప్రమాదం ఉందని మండల వ్యవసాయాధికారి కొప్పిశెట్టి ప్రభాకర్ సూచించారు. మండలంలోని పసలపూడి రైతు సేవా కేంద్రంలో గురువారం మండల వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ప్రపంచ నేల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు, ప్రజాప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. భూసారం తగ్గడానికి ముఖ్యంగా మోతాదుకు మించి రసాయన ఎరువులు, రసాయనిక పురుగు మందులు వినియోగంతో నేల స్వభావం తగ్గుతుందన్నారు. పంట వ్యర్థాలను నిప్పు అంటించడంతో నేల సారం దెబ్బతింటుందన్నారు. రైతులకు ఉపయోగపడే సూక్ష్మజీవులు, శిలింద్రాలు నశించిపోతున్నాయన్నారు. అలాగే భూమిలో సేంద్రియ కర్బనం తగ్గిపోతుందన్నారు. ఫలితంగా భవిష్యత్తులో విత్తనం వేసినా మొలకెత్తకుండా ఉండే ప్రమాదం ఉందన్నారు. రైతులు మట్టి నమూనా ఫలితాల ఆధారంగా ఎరువులను ఉపయోగించాలన్నారు. సేంద్రియ సాగు ద్వారానే నేలలను పరిరక్షించుకోగలమన్నారు. భూసార పరీక్షల ఆదారంగా రైతులు ఎరువులు, పురుగుమందులు వాడాలని, తద్వారా సాగు ఖర్చు తగ్గించుకోవచ్చునన్నారు. అధిక దిగుబడులు సాధించడాలంటే రైతులు అధునాతన సాంకేతిక పద్ధతులను వినియోగించాలన్నారు.ప్రధాన ఎరువులు నత్రజని భాస్వరం, పొటాషియంలతో పాటు సూక్ష్మ పోషకాలైన జింకును కూడా నేలకు అందించాలన్నారు. పంటకు పంటకు మధ్య పచ్చిరొట్ట ఎరువులైన పిల్లి పెసర, జీలుగా వంటి పంటను వేసి 30 నుంచి 45 రోజుల వ్యవధిలో నేలలో కలిగి ఉన్నట్లయితే భూసారం పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో భూసార పరీక్షల పత్రాలను గురించి వివరిస్తూ రైతులకు వాటిని ఏ విధంగా ఉపయోగించాలో వివరించారు. సమావేశంలో మండల వ్యవసాయ సహాయకులు షారోని, రైతులు పాల్గొన్నారు.

ప్రపంచ నేలల సంరక్షణ దినోత్సవం



ఉండూరులో నేల విశిష్టతపై రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ

రామచంద్రపురం రూరల్: ఉండూరు రైతు సేవా కేంద్రం వద్ద మండల వ్యవసాయ అధికారి ఎస్.సత్యప్రసాద్ ఆధ్వర్యంలో గురువారం ప్రపంచ నేలల సంరక్షణ దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ఏఓ గ్రామంలోని రైతులకు నేల విశిష్టత గురించి విపులంగా వివరించారు. నేల ఆవశ్యకత, నేలను ఏ విధంగా కాపాడుకోవాలి అనే అంశాలపై అవగాహన కల్పించారు. రసాయన ఎరువుల వాడకం తగ్గించి సేంద్రియ ఎరువులు వాడాలని సూచించారు. భూసార పరీక్షల ఫలితాల కార్డులను రైతులకు అందజేశారు. కార్యక్రమంలో రైతులు, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఎమ్మెల్సీ ఎన్నికలు

నియోజకవర్గంలో 94.29 శాతం పోలింగ్



రాయవరం 48వ పోలింగ్ కేంద్రం వద్ద ఓటరు వివరాలు చెక్ చేసి పంపిస్తున్న ఎస్సై బుజ్జిబాబు



రాయవరం పోలింగ్ బూత్ వద్ద ఓటింగ్ సరళిని ఆరా తీస్తున్న తహసీల్దార్ శెట్టి



మండపేట 46వ నంబర్ బూత్‌లో పోలింగ్ నిర్వహణను పరిశీలిస్తున్న ఆర్డీవో అఖిల



కె.గంగవరంలో ఓటు హక్కు వినియోగించుకుంటున్న ఉపాధ్యాయులు



రామచంద్రపురం పోలింగ్ బూత్ వద్ద ఓటు వేసి వస్తున్న ఉపాధ్యాయులు

కపిలేశ్వరపురం: మండపేట నియోజకవర్గంలో ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నిక పోలింగ్ గురువారం ప్రశాంతంగా ముగిసింది. నియోజకవర్గంలో మూడు కేంద్రాలను ఏర్పాటు చేయగా వాటి పరిధిలో 94.29 శాతం పోలింగ్ నమోదైంది. మొత్తం 298 ఓట్లకు గానూ 281 ఓట్లు పోలయ్యాయి. పురుషుల ఓట్లు 201 కాగా 192 మంది, స్త్రీలు ఓట్లు 97 కాగా 89 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఆయా పోలింగ్ కేంద్రాలను రామచంద్రపురం ఆర్డీఓ డి.అఖిల సందర్శించారు.

కాజులూరులో..

కాజులూరు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం జరిగిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పోలింగ్ ప్రశాంతంగా జరిగినట్టు మండల తహసీల్దార్ ఎల్.శివకుమార్ తెలిపారు. ఎన్నిక అనంతరం ఆయన మాట్లాడుతూ మండలంలో 71 మంది ఉపాధ్యాయులకు గాను 67 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారన్నారు. మండలంలో 95 శాతం పోలింగ్ జరిగిందన్నారు. గొల్లపాలెం ఎస్సై ఎం.మోహన్‌కుమార్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారన్నారు.

కె.గంగవరంలో..

కె.గంగవరం: మండల కేంద్రమైన కె.గంగవరంలో గురువారం జరిగిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నిక ప్రశాంతంగా జరిగింది. మండల వ్యాప్తంగా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి 76 మందికి గాను 69 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. మిగిలిన ఏడుగురు వివిధ కారణాల వల్ల ఓటింగుకు రాలేని పరిస్థితిలో ఉన్నారని తెలిసింది. మొత్తం పోలైన ఓట్లలో పురుషులు 52 మంది కాగా మహిళలు 17 మంది ఓటు హక్కును వినియోగంచుకున్నారు. మొత్తం మండల వ్యాప్తంగా 99 శాతం ఓటింగ్ పూర్తయిందని ఎంపీడీఓ ఎస్.శ్రీనివాసరావు, తహసీల్దార్ మృత్యుంజయరావు తెలిపారు. కె.గంగవరం ఎస్సై జానీబాషా పోలింగ్ కేంద్రం వద్ద ఎటువంటి సంఘటనలు జరగకుండా సిబ్బందితో బందోస్తు నిర్వహించారు.

రామచంద్రపురంలో..

రామచంద్రపురం: ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ గురువారం రామచంద్రపురం పోలింగ్ బూత్ నంబర్ 49లో ప్రశాంతంగా జరిగింది. పాత తహసీల్దార్ కార్యాలయంలో పోలింగ్ బూత్‌ను ఏర్పాటు చేశారు. ఈ పోలింగ్ బూత్‌లో మొత్తం 414 మంది ఓటర్లు ఉండగా అందులో 393 మంది ఓటు హక్కు వినియోగంచుకోగా 94.93 శాతం పోలింగ్ అయినట్లు పోలింగ్ అధికారులు వెల్లడించారు. రామచంద్రపురం డీఎస్పీ బి.రామకృష్ణ నేతృత్వంలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆర్డీవో దేవరకొండ అఖిల, తహసీల్దార్ సావిత్రి పోలింగ్ నిర్వహణను పరిశీలించారు.

మండపేటలో..

మండపేట: ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు మండపేటలో ప్రశాంతంగా జరిగాయి. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని గురువారం రామచంద్రపురం ఆర్డీవో డి.అఖిల సందర్శించారు. ఇక్కడ ఏర్పాట్లను, పోలింగ్ సరళిని ఆమె పరిశీలించారు. మండపేట మండలంలో ఒక పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయగా ఉపాధ్యాయులంతా ఈ కేంద్రానికి వచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎంపీడీవో కార్యాలయంలో ఉదయం 8 గంటలకు ప్రారంభమైన పోలింగ్ సాయంత్ర 4 గంటలతో ముగిసింది. ఆద్యంతం పోలింగ్ ప్రశాంత వాతావరణంలో జరిగింది. టౌన్ ఎస్ఐ హరికోటి శాస్త్రి నేతృత్వంలో ఏఎస్ఐ చిన్నారావు, పోలీసు సిబ్బంది కేంద్రం వద్ద బందోబస్తు నిర్వహించారు. ఈ సందర్భంగా సహాయ ఎన్నికల అధికారి, తహసీల్దారు తేజేశ్వరరావు మాట్లాడుతూ 183 ఉపాధ్యాయ ఓటర్లు ఉండగా వారిలో 172 మంది ఓట్లు పోలయ్యాయని తెలిపారు. 93.99 శాతం పోలింగ్ నమోదైనట్టు ఆయన చెప్పారు. ఆర్డీవో వెంట తహసీల్దారు తేజేశ్వరరావు, డిప్యూటీ తహసీల్దారు మహెర్‌బాబా, సిబ్బంది పాల్గొన్నారు.

రాయవరంలో 93 శాతం పోలింగ్ నమోదు

రాయవరం: ఓటు హక్కు వినియోగించేందుకు ఓటర్లు ఉత్సాహం కనబర్చారు. ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికకు గురువారం రాయవరంలో నిర్వహించిన పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో ఉదయం ఎనిమిది గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు జరిగింది. ఉదయం నుంచే ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకునేందుకు తరలి వచ్చారు. తహసీల్దారు ఐ.పి.శెట్టి పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించి, ఓటింగ్ సరళిపై ఆరా తీశారు. రాయవరం ఎస్సై పి.బుజ్జిబాబు ఆధ్వర్యంలో సిబ్బంది శాంతిభద్రతలను పర్యవేక్షించారు.

ఉత్సాహంగా పోలింగ్ కేంద్రాలకు

పలువురు ఉపాధ్యాయ ఓటర్లు ఉత్సాహంగా పోలింగ్ కేంద్రాలకు వచ్చి ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఉదయం ఎనిమిది గంటలకే పోలింగ్ ప్రారంభం కాగా, 10 గంటల వరకు మందకొడిగా సాగింది. 11గంటల నుంచి పోలింగ్ ఊపందుకుంది. మొత్తం మీద పోలింగ్ ప్రశాంతంగా జరిగింది.